VEGA
JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers

కలం కౌంటర్
KALAM COUNTER TELUGU DAILY
తెలుగు దినపత్రిక
సంపుటి : 9 సంచిక : 252
పేజీలు : 4 వెల రూ.4/-
Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor
శుక్రవారం 20 ఫిబ్రవరి 2026

# రేపు ఢిల్లీకి సీఎం చంద్రబాబు..
# ఏఐ ఇంపాక్ట్ సదస్సులో కీలక ఒప్పందాలు!

**● ఏపీని టెక్నాలజీ హబ్‌గా మార్చే లక్ష్యంతో సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన ● ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026లో పాల్గొననున్న ముఖ్యమంత్రి ● ఐబీఎం, ఐఐటీ మద్రాస్, ఎన్విడియా వంటి దిగ్గజ సంస్థలతో కీలక ఒప్పందాలు ● 10 లక్షల మంది యువతకు ఏఐ, క్వాంటం టెక్నాలజీలో నైపుణ్య శిక్షణ ● కేంద్ర మంత్రులు, పారిశ్రామికవేత్తలతో సమావేశం కానున్న చంద్రబాబు**



**అమరావతి,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్‌ను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో అగ్రగామిగా నిలబెట్టడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీలో కీలక పర్యటన చేపట్టనున్నారు. రేపు (ఫిబ్రవరి 20) ఢిల్లీలోని భారత్ మండపంలో జరగనున్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026'లో ఆయన పాల్గొంటారు. ఈ పర్యటనలో భాగంగా రాష్ట్రంలో ఏఐ ఆధారిత అభివృద్ధికి, యువతకు నైపుణ్య శిక్షణకు మార్గం సుగమం చేసేలా పలు అంతర్జాతీయ దిగ్గజ సంస్థలతో కీలక ఒప్పందాలు (ఎంఓయూలు) చేసుకోనున్నారు. ఈ సదస్సులో భాగంగా ఏపీ ప్రభుత్వం పలు చరిత్రాత్మక ఒప్పందాలకు శ్రీకారం చుట్టనుంది. రాష్ట్రంలోని 10 లక్షల మంది యువతకు ఏఐ, క్వాంటం టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ వంటి భవిష్యత్ సాంకేతికతల్లో నైపుణ్యాలు కల్పించేందుకు దిగ్గజ ఐటీ సంస్థ ఐబీఎంతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకోనుంది. అలాగే, ఏఐ, క్వాంటం టెక్నాలజీలలో పరిశోధన, అభివృద్ధిని ప్రోత్సహించేందుకు యూనిసీసీ సంస్థతో కలిసి 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలో క్వాంటం ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు కోసం ఎన్ఐఈఎల్ఐటీ సంస్థతో, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ట్యూటర్ కోసం ఐఐటీ మద్రాస్‌తోనూ ప్రభుత్వం ఎంఓయూలు చేసుకోనుంది. ప్రముఖ టెక్ సంస్థ ఎన్విడియా భాగస్వామ్యంతో రాష్ట్రంలో ఏఐ లివింగ్ ల్యాబ్స్ ఏర్పాటుపై కూడా ఈ సదస్సులో కీలక ప్రకటన చేయనున్నారు.

రేపు ఉదయం 9:30 గంటలకు జరిగే ప్లీనరీ సెషన్‌లో అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద, టీసీఎస్ ప్రతినిధులతో కలిసి చంద్రబాబు ప్రసంగిస్తారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు ప్రపంచ ఆర్థిక వేదిక (వరల్డ్ ఎకనామిక్ ఫోరం) నిర్వహించే రౌండ్‌టేబుల్ సమావేశంలో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్, డబ్ల్యూఈఎఫ్ సీఈఓ బోర్గే బ్రెండేతో కలిసి కృత్రిమ మేధస్సు అంశంపై చర్చిస్తారు. ఈ పర్యటనలో భాగంగా యునైటెడ్ కింగ్‌డమ్ ప్రతినిధి బృందంతో పాటు అరామ్కో, అడోబ్, ఆటోడెస్క్ వంటి కంపెనీల అధిపతులతోనూ ముఖ్యమంత్రి విడివిడిగా సమావేశమై రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడంపై చర్చలు జరుపుతారు.

**ఈ సాయంత్రం జైపూర్ కు!** కాగా, ఢిల్లీ పర్యటనకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇవాళ సాయంత్రం జైపూర్ వెళ్లనున్నారు. కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్, ఐఏఎస్ అధికారి వికాస్ మర్మత్ వివాహ వేడుకకు హాజరై, రాత్రికి అక్కడే బస చేస్తారు. రేపు ఉదయం జైపూర్ నుంచి నేరుగా ఢిల్లీకి చేరుకొని ఏఐ సదస్సులో పాల్గొంటారు.

# యువతకు పెద్దఎత్తున ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం

● కోచింగ్ సెంటర్ల నిర్వహణ గురించి సుప్రీం కోర్టు ఇచ్చిన మార్గదర్శకాల అమలు పై మంత్రి లోకేష్ సమీక్ష - 4లో

# అసెంబ్లీలో చేనేత వస్త్ర ప్రదర్శన

-స్వయంగా వస్త్రాలు కొనుగోలు చేసిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు









**అమరావతి,కలంకౌంటర్ :** అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఆవరణలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల ప్రదర్శన, విక్రయ కేంద్రాన్ని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు గురువారం ప్రారంభించారు. ఆప్కో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ స్టాళ్లను ఆయన క్షుణ్ణంగా పరిశీలించి, చేనేత కార్మికులతో ముచ్చటించారు. వారి నైపుణ్యాన్ని అభినందిస్తూ, స్వయంగా పట్టుచీరలు, పట్టు పంచె మరియు షర్ట్‌ను కొనుగోలు చేసి కార్మికుల్లో ఉత్సాహాన్ని నింపారు. దేశవ్యాప్తంగా ఉన్న చేనేత సంఘాలలో మన రాష్ట్రం నుంచే అత్యధికంగా 32 నుండి 33 సంఘాలు ఉండటం గర్వకారణమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల వస్త్రాలన్నీ ఒకే వేదికపై అందుబాటులో ఉన్నాయని, ప్రజలందరికీ మన చేనేత వైభవం తెలియజేసేందుకే ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు స్పీకర్ తెలిపారు. నేతన్నలను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని, మంత్రులు, ఎమ్మెల్యేలు మరియు ఎమ్మెల్సీలు అందరూ ఈ స్టాళ్లను సందర్శించి వస్త్రాలను కొనుగోలు చేయాలని ఆయన కోరారు. బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు అందుబాటులో ఉండే ఈ స్టాళ్లలో నాణ్యమైన వస్త్రాలపై 40 శాతం వరకు రాయితీ ఇస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించి, కార్మికులను ప్రోత్సహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి సవిత, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు , కామినేని శ్రీనివాస్, బుచ్చయ్య చౌదరి , ఇతర మంత్రులు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.






# వార్షిక క్రీడలు



**తిరుమల,కలంకౌంటర్ :** టీటీడీ ఉద్యోగుల వార్షిక క్రీడలలో భాగంగా టేబుల్ టెన్నిస్ సింగల్స్ విన్నర్స్ గా నిఖిల్, రన్నర్స్ గా చీర్ల కిరణ్, టేబుల్ టెన్నిస్ డబల్స్ వినర్స్ గా మునిశంకర్ , గోపి జట్టు, రన్నర్స్ గా చీర్ల కిరణ్ , రమేష్ జట్టు.

## శివాజీ ని ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలి - డాక్టర్ తన్నీరు మల్లికార్జునరావు



**కందుకూరు,కలంకౌంటర్ :** చత్రపతి శివాజీ మహారాజ్ ను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కందుకూరు ఆర్ఎస్ఎస్ ఖండ సంఘచాలక్, హరణి ప్రజా వైద్యశాల డాక్టర్ తన్నీరు మల్లికార్జునరావు అన్నారు. చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా కందుకూరు బజరంగి సర్కిల్ వద్ద చత్రపతి శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ తన్నీరు మల్లికార్జునరావు మాట్లాడుతూ మొగలల నుండి భారతీయులను కాపాడి, హిందూ సామ్రాజ్యాన్ని ఏర్పరచిన మహాధీరుడు చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా వారికి నివాళులర్పించడం ఎంతో సంతోషమని అన్నారు. శివాజీ ధీరత్వాన్ని, దేశం కోసం చేసిన ఆయన త్యాగాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని మల్లికార్జున రావు అన్నారు. ఈ కార్యక్రమంలో కందుకూరి బిజెపి ఇన్చార్జి ఘట్టమనేని హరిబాబు, మంచిరాజు మురళీమోహన్, ఇప్పగుంట మాధవరావు, కళ్యాణ్ మిత్రబృందం, చక్కా వెంకట కేశవరావు, ఇస్కాల మధు, నారాయణం రాధాకృష్ణమాచార్యులు, గుర్రం చిన్న అల్లూరయ్య, రవ్వా శ్రీనివాసులు, బిజెపి నాయకులు, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత పథకాలపై సుప్రీంకోర్టు అసహనం.. ఎలాంటి సంస్కృతిని అభివృద్ధి చేస్తున్నామని మండిపాటు!

- అందరికీ ఉచిత విద్యుత్తును ప్రకటించిన స్టాలిన్ ప్రభుత్వం
- రాష్ట్ర ఆర్థిక స్థితిని పట్టించుకోకుండా ఉచిత విద్యుత్ ఎలా ఇస్తారన్న సుప్రీం
- ఉచితాల వల్ల దేశ అభివృద్ధి దెబ్బతింటుందని వ్యాఖ్య



**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటిస్తున్న ఉచిత పథకాలు దేశ ఆర్థిక వృద్ధికి ఆటంకమవుతాయని సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, విపుల్ పంచోలితో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఉచిత ఆహారం, సైకిళ్లు, విద్యుత్తు ఇవ్వడం కన్నా ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల సృష్టిపై దృష్టి సారించాలని సూచించింది. తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వ ఉచిత విద్యుత్తు ప్రకటనపై సర్వోన్నత న్యాయస్థానం సీరియస్‌గా స్పందించింది. వినియోగదారుల ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా రాష్ట్రంలోని అందరికీ ఉచిత విద్యుత్ అందించేలా తమిళనాడు పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రతిపాదించింది. ఈ నేపథ్యంలో డీఎంకే ప్రభుత్వంపై దాఖలైన పిటిషన్ ను విచారిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పట్టించుకోకుండా ఉచిత విద్యుత్తును ఎలా అందిస్తారని ప్రశ్నించింది. చాలా రాష్ట్రాల్లో రెవెన్యూ లోటు పెరుగుతోందని... అయినప్పటికే ఉచిత పథకాల పంపిణీ జరుగుతోందని ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ఇలాంటి ఉచిత పథకాల వల్ల దేశ అభివృద్ధికి విఘాతం కలుగుతుందని వ్యాఖ్యానించింది. సంక్షేమ పథకాల్లో భాగంగా కరెంట్ బిల్లులు చెల్లించలేని వారికి ఉచిత విద్యుత్ అందిస్తామంటే ఒక అర్థం ఉంటుందని... కానీ, మీ-రు ఆర్థిక స్థాయితో సంబంధం లేకుండా అందరికీ ఉచిత విద్యుత్ ఇస్తామని చెబుతున్నారని అసహనం వ్యక్తం చేసింది. ఆహారం, విద్యుత్ ఇలా అన్నీ ఫ్రీగా ఇస్తూ... మనం ఎలాంటి సంస్కృతిని అభివృద్ధి చేస్తున్నామని ప్రశ్నించింది. ఎన్నికలకు ముందే రాష్ట్రాలు ఇలాంటి ఉచిత పథకాలను ఎందుకు తీసుకొస్తున్నాయని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఎన్నికల సమయంలో అన్నీ ఉచితంగా ఇచ్చుకుంటూ పోతే... అభివృద్ధి కార్యక్రమాలకు ఒక్క పైసా కూడా మిగలదని వ్యాఖ్యానించింది. ఈ పిటిషన్ పై కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

## ఈ నెల 24న ఏపీ కేబినెట్ భేటీ

**అమరావతి,కలంకౌంటర్ :** ఏపీ మంత్రిమండలి సమావేశం ఈ నెల 24వ తేదీన జరగనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 24వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు వెలగపూడి సచివాలయంలో క్యాబినెట్ మీటింగ్ హాలులో మంత్రిమండలి సమావేశం జరుగుతుంది. ఈ మేరకు సీఎస్ విజయానంద్ నిన్న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సమావేశానికి సంబంధించి అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు నిర్ణీత ఫార్మెట్ లో తమ ప్రతిపాదనలను 23వ తేదీ ఉదయం 11 గంటల లోపు పంపాలని ఉత్తర్వుల్లో సీఎస్ పేర్కొన్నారు. కాగా, కేబినెట్ భేటీలో ఇటీవల జరిగిన స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డ్ (ఎస్ఐపీబీ) ఆమోదించిన రూ.29,021 కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేయనున్నారు. అలానే వివిధ కీలక అంశాలపై చర్చించి ఆమోదించడంతో పాటు తాజా రాజకీయ పరిణామాలపై చర్చించి మంత్రులకు సీఎం కీలక సూచనలు చేయనున్నారు.

# చేనేత స్టాళ్లను సందర్శించిన హోం మంత్రి అనిత







**అమరావతి,కలంకౌంటర్ :** అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ (ఆప్కో) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల స్టాళ్లను గురువారం హోం మంత్రి అనిత సందర్శించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల చేనేత కళాకారుల నైపుణ్యానికి ప్రతిరూపాలుగా నిలిచే ఉత్పత్తులు సందర్శకులను ఎంతో ఆకట్టుకుంటున్నాయని మంత్రి అనిత పేర్కొన్నారు. పొందూరు ఖాదీ, వెంకటగిరి, ధర్మవరం పట్టు చీరల నుండి మంగళగిరి, బందరు (మచిలీపట్నం) , మాధవరం చేనేత వస్త్రాల వరకు అద్భుతమైన కలెక్షన్లు ఇక్కడ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. చేనేత రంగాన్ని ప్రోత్సహించడం, మన నేతన్నల శ్రమకు తగిన గుర్తింపునివ్వడం మనందరి బాధ్యత అని మంత్రి అనిత పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమం మరియు ఉత్పత్తుల ప్రోత్సాహానికి కట్టుబడి ఉందని ఆమె స్పష్టం చేశారు. ఈ స్టాళ్లు బడ్జెట్ సమావేశాలకు హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు , సందర్శకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి.

# 200 మందికి ఉచితంగా మూడేళ్లపాటు 'సివిల్స్'లో శిక్షణ

- బ్రోచర్ను రిలీజ్ చేసిన మంత్రులు సత్యకుమార్, పార్థసారథి
- నిర్వాహకులకు మంత్రుల అభినందనలు

**అమరావతి,కలంకౌంటర్ :** ఉచిత సివిల్స్ శిక్షణ దరఖాస్తుల స్వీకరణ బ్రోచరు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, సమాచార శాఖ మంత్రి పార్థసారధి సచివాలయంలో గురువారం విడుదల చేశారు. మంత్రి సత్య కుమార్ చాంబర్లో ఈ కార్యక్రమం జరిగింది. చలసాని బలరామ ప్రసాద్ (సీబీఆర్) అకాడమీ ద్వారా ఎంపిక కాబోయే 200 మంది అభ్యర్థులకు మూడేళ్లపాటు ఉచిత వసతి, బస సదుపాయాలతో శిక్షణ ఇవ్వడాన్ని మంత్రులు స్వాగతించారు. యూపీపీఎస్సీ, ఏపీపీఎస్సీ (ఐఏఎస్, ఐపీఎస్, గ్రూప్-1,2) ఇతర ఉద్యోగ నియామకాలకు అభ్యర్థులను సన్నద్ధం చేస్తామని డాక్టర్ లక్ష్మయ్య (ఐఏఎస్ స్టడీ సర్కిల్ ) వెల్లడించారు. 200 మందిలో వంద మంది అమ్మాయిలు ఉంటారని పేర్కొన్నారు. వచ్చేనెల 15న అమ్మాయిలు, ఏప్రిల్ 5న యువకులకు విడివిడిగా శిక్షణ కోసం ఎంపిక రాత పరీక్షలు నిర్వహించనున్నారు. వీటి ద్వారా ఎంపిక చేసిన వారికి మౌఖిక పరీక్షలు కూడా జరుపుతారు. వీటిల్లో చూపించే ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు

**విజయవాడ, వినుకొండలో శిక్షణ కేంద్రాలు..** విజయవాడలోని కేశీద్రంలో అమ్మాయిలకు, వినుకొండలోని కేంద్రంలో అబ్బాయిలకు శిక్షణ ఇస్తారు. ప్రముఖ సామాజిక సేవకుడు చలసాని బలరామ ప్రసాద్ (84 ఏళ్లు) అభ్యర్థులకు ఉచిత భోజన, బస సదుపాయాన్ని కల్పిస్తుండగా డాక్టర్ లక్ష్మయ్య ఐ ఎ. ఎస్ స్టడీ సర్కిల్ వారు ఉచితంగా శిక్షణ ఇస్తారు. ఒక్కో అభ్యర్థికి మూడేళ్లపాటు ఉచిత వసతి, బస సదు



పాయాలతో శిక్షణ ఇచ్చినందుకు సుమారు రూ.10 లక్షల వరకు వ్యయమవుతుంది.

**మంత్రి సత్యకుమార్ స్ఫూర్తితో.** మంత్రి సత్యకుమార్ యాదవ్ చొరవ, ఔదార్యంతో ధర్మవరం నియోజకవర్గం నుంచి ఎంపికచేసిన 28 మంది అమ్మాయిలు ప్రస్తుతం సివిల్స్ కు ఉచితంగా గత 9 నెలల నుంచి హైదరాబాదులో డాక్టర్ లక్ష్మయ్య సంస్థ ద్వారా శిక్షణ పొందుతున్నారు. మరో రెండేళ్లపాటు వీరికి ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. ఈ స్ఫూర్తి కొనసాగింపుగా మరో 200 మందికి శిక్షణ ఇచ్చే కార్యక్రమం జరగబోతుంది. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, వరదరాజుల రెడ్డి, కూడా పాల్గొన్నారు.

# క్రైస్తవ ఆస్తులు ప్రభుత్వ పరిధిలోకి రావు

- అక్రమాలు ప్రభుత్వ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం
- అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్



**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్రంలో క్రైస్తవ ఆస్తులు ప్రభుత్వ పరిధిలోకి రావని, అయితే ఆక్రమణలకు సంబంధించి ఏమైనా ఫిర్యాదులు ప్రభుత్వ దృష్టికి తెస్తే, అమలులో ఉన్న చట్టాలమేరకు జిల్లా కలెక్టరు, ఇతర సంబంధిత అధికారులతో విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. గురువారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాలలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి ఫరూక్ సమాధానం ఇచ్చారు. క్రైస్తవ సంస్థల నుండి వ్యతిరేకత వచ్చిన తర్వాత క్రైస్తవ ఆస్తులపై ప్రభుత్వం నేరుగా జోక్యం చేసుకోవడం లేదని స్పష్టం చేశారు. ఫిర్యాదులు వస్తే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. జెరూసలేం యాత్రకు సంబంధించిన ప్రశ్నకు మంత్రి ఫరూక్ సమాధానం ఇస్తూ ఇజ్రాయిల్ లో నెలకొన్న యుద్ధ వాతావరణం వల్ల ఇక్కడి నుండి అక్కడికి యాత్రికులను పంపే పరిస్థితి ప్రస్తుతం లేదన్నారు. క్రిస్టియన్ భవన్ నిర్మాణం కోసం గత టీడిపి ప్రభుత్వ హయాంలో రెండు ఎకరాల ప్రభుత్వ భూమి, రూ.20 కోట్లు నిధులు ముఖ్యమంత్రి చంద్రబాబు విడుదల చేసిన విషయాన్ని మంత్రి ఫరూక్ గుర్తు చేశారు. 2019 లో అధికారంలోకి వచ్చిన జగన్ ఆన్ గోయింగ్ ప్రాజెక్ట్ క్రిస్టియన్ భవన నిర్మాణం కోసం ఒక్క రూపాయి కూడా ఐదేళ్లలో ఖర్చు చేయలేదని ధ్వజమెత్తారు. తానేమో క్రిస్టియన్ అని జగన్ చెప్పుకుంటాడని.. నాకైతే తెలియదు గానీ జగన్ క్రిస్టియన్ కాదేమో ననుకుంటున్నానని అన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో గుంటూరులో క్రిస్టియన్ భవన్, కడపలో హజ్ హౌస్ ల నిర్మాణం చేపడితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ వాటిని పూర్తి చేసే బాధ్యత విస్మరించాడని మంత్రి ఫరూక్ ధ్వజమెత్తారు. 2014-2019 లో చర్చిలకు రూ. 90 కోట్లు ఇవ్వడం జరిగిందని,అయితే 2019 - 2024 లో కేవలం రూ. 4.12 కోట్లు జగన్ ఇచ్చారన్నారు. దీన్ని బట్టి క్రైస్తవుల పట్ల ఎవరికి అభిమానం ఉందో స్పష్టం అవుతుందని మంత్రి అన్నారు. మన ప్రభుత్వం- మన బాధ్యతగా భావించి క్రిస్టియన్ భవన్ నిర్మాణం పూర్తికి కట్టుబడి ఉందని, పూర్తి చేస్తామని మంత్రి ఫరూక్ అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో పేర్కొన్నారు.

# ఇంటర్ పరీక్షల నేపథ్యంలో ఇంటర్ విద్యార్థులతో మంత్రి డిఎస్ బీవీ స్వామి వీడియో కాన్ఫరెన్స్

- జేఈఈ మెయిన్స్ లో అర్హత సాధించిన 161 మంది విద్యార్థులకు మంత్రి డా.స్వామి అభినందనలు



**అమరావతి,కలంకౌంటర్ :** పరీక్షల సమయంలో విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా, ధైర్యంగా పరీక్షలు రాయాలని విద్యార్థులకు రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి సూచించారు. ఇంటర్ పరీక్షల నేపథ్యంలో గురువారం నాడు తాడేపల్లిలో కార్యాలయంలో అంబేద్కర్ గురుకులాల ఇంటర్ విద్యార్థులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన మంత్రి పరీక్షల పట్ల భయం పోగొట్టేలా విద్యార్థుల్లో ధైర్యం నింపారు. ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని విద్యార్థులకు సూచించారు. పరీక్షల్లో అందరూ ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. పరీక్షల సమయంలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. అనంతరం జేఈఈ మెయిన్స్ లో అర్హత సాధించిన 161 మంది విద్యార్థులను మంత్రి స్వామి అభినందించారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అంబేద్కర్ గురుకులాల విద్యార్థులు 161 మంది జేఈఈ మెయిన్స్ కి అర్హత సాధించారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రోత్సాహం వల్లే గతేడాది కంటే 3 మూడు రెట్లు ఎక్కువ మంది విద్యార్థులు జేఈఈ మెయిన్స్ కు అర్హత సాధించారని తెలిపారు. గతేడాది ఐఐటీ, నీట్ లో సీట్లు సాధించిన 57 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1 లక్ష చొప్పున ఆర్థిక ప్రోత్సాహం అందించామని మంత్రి తెలిపారు. పేద పిల్లలు ఇంజనీర్లు,డాక్టర్లు కావాలన్నదే మ-ుఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమన్నారు. పేద విద్యార్థుల కోసం కూటమి ప్రభుత్వం ఎంత ఖర్చునైనా భరించి వారిని అన్ని విధాల ప్రోత్సహిస్తుందని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వి. ప్రసన్న వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# చీజ్ ప్యాకెట్ చూపించి నెయ్యి అంటారా?

- వైసీపీకి కనీస అవగాహన కూడా లేదు
- ఇందాపూర్,హెరిటేజ్‌కు సంబంధం లేదు... కావాలనే బద్నాం చేసే కుట్ర
- ఆర్థిక మూలాలపై దాడి చేయడం వైసీపీ ఫ్యాక్షన్ మనస్తత్వానికి నిదర్శనం
- హెరిటేజ్‌పై వైసీపీ తప్పుడు ప్రచారం, ఆధారాలుంటే చూపాలని మండలిలో సవాలు విసిరిన మంత్రి అచ్చెన్నాయుడు
- ప్రతిరోజూ ఒకే అంశంతో వైసీపీ సభా సమయాన్ని వృథా చేస్తోంది - మంత్రి అచ్చెన్న తీవ్ర ఆగ్రహం



**అమరావతి,కలంకౌంటర్ :** శాసనమండలిలో వైసీపీ సభ్యుల వ్యవహారంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హెరిటేజ్ సంస్థపై కావాలనే తప్పుడు ప్రచారం చేస్తూ, ప్రతిష్ఠను దెబ్బతీయాలనే దురుద్దేశంతో వైసీపీ సభ్యులు ఆందోళనలు చేపడుతున్నారని ఆయన మండిపడ్డారు. ఇందాపూర్ డెయిరీకి హెరిటేజ్‌కు ఎక్కడా ఎలాంటి సంబంధం లేదని గత రెండు రోజులుగా స్పష్టంగా సమాధానం ఇచ్చినప్పటికీ, అదే అంశాన్ని మళ్లీ మళ్లీ తీసుకొచ్చి సభా సమయాన్ని వృథా చేస్తున్నారని విమర్శించారు.

**ఆధారాలుంటే చూపండి...లేదంటే బహిరంగ క్షమాపణ చెప్పాలి..** ఇందాపూర్‌కు హెరిటేజ్‌కు సంబంధం ఉందని ఆరోపిస్తున్న వైసీపీ నేతలు, ఒక్క చిన్న ఆధారం అయినా చూపించాలని మంత్రి అచ్చెన్నాయుడు సవాల్ విసిరారు. కానీ ఆధారాలు చూపకపోగా, బయట ప్రెస్‌మీట్లు పెట్టి చీజ్ ప్యాకెట్లు చూపిస్తూ నెయ్యి ప్యాకెట్లు అంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. చీజ్,నెయ్యి మధ్య తేడా కూడా తెలియకుండా వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యన్నారాయణ మాట్లాడటం బాధ్యతారాహిత్యమని అన్నారు. ఈ తప్పుడు ప్రచారంపై హెరిటేజ్ సంస్థ బొత్సకు లీగల్ నోటీసులు ఇచ్చిందని, వాటికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఆయనకు ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఆధారాలుంటే చర్చిద్దాం, లేకపోతే అసత్య ప్రచారాన్ని ఆపాలని హెచ్చరించారు.

**ప్రభుత్వాల పేరుతో వ్యాపారాలు కాదు....హెరిటేజ్ చారిత్రాత్మక నిర్ణయం..** హెరిటేజ్ సంస్థ ప్రభుత్వాలను అడ్డం పెట్టుకుని వ్యాపార లావాదేవీలు జరపకూడదని చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని మంత్రి గుర్తుచేశారు. ప్రభుత్వాల పేరుతో డబ్బులు దోచుకునే సంస్కృతి హెరిటేజ్‌ది కాదని, గతంలో ప్రభుత్వ ధనాన్ని భారతి సిమెంట్ పేరుతో దోచుకున్న చరిత్ర వైసీపీకి మాత్రమే ఉందని తీవ్ర విమర్శలు చేశారు. వైసీపీ నేతల చర్యలు ఫ్యాక్షన్ మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయని, గతంలో రాయలసీమలో ఫ్యాక్షన్‌ను ఎలా అరికట్టామో అలాగే ఇప్పుడు కూడా ప్రజల ఆర్థిక మూలాలను దెబ్బతీయాలనే ప్రయత్నాలను సహించబోమని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. చీని తోటలు కట్ చేయడం, ఆస్తులు ధ్వంసం చేయడం వంటి పాత పద్ధతులే ఇప్పుడు సంస్థలపై బదనాం చేయడంగా మారాయని మండిపడ్డారు.

**సభను ఇబ్బందికి గురిచేయడం సరికాదు..** శాసనమండలిలో ప్రతిరోజూ ఒకే అంశాన్ని తీసుకొచ్చి వాయిదా తీర్మానాలతో సభను ఇబ్బందికి గురిచేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని మంత్రి హెచ్చరించారు. ఆధారాలుంటే టేబుల్‌పై పెట్టండి, లేదంటే అసత్య ప్రచారం మానేసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# ఈ నెల 26 నుంచి తెలంగాణ బడ్జెట్ సమావేశాలు, 28న బడ్జెట్

- 23వ తేదీన మంత్రివర్గ సమావేశం
- 10 నుంచి 15 రోజుల పాటు బడ్జెట్ సమావేశాలు
- మొదటి రోజు గవర్నర్ ప్రసంగం



**అమరావతి,కలంకౌంటర్ :** త్వరలో తెలంగాణ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 26వ తేదీ నుంచి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. 28వ తేదీన ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. 23వ తేదీన మంత్రివర్గ సమావేశం అనంతరం బడ్జెట్ సమావేశాల తేదీని ప్రకటించనున్నారు. పది నుంచి పదిహేను రోజుల పాటు బడ్జెట్ సమావేశాలను నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. మొదటి రోజు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగిస్తారు. మరుసటి రోజు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగనుంది. ఇప్పటికే ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క నేతృత్వంలో శాఖల వారీగా మంత్రులు, అధికారులతో సమావేశమై ప్రతిపాదనలను స్వీకరించారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కల్పనే లక్ష్యం

**● రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ● ఏక సభ్య కమిషన్ గా రాజీవ్ రంజన్ మిశ్రా నియామకం ● కమిషన్ నియామకంపై సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు ● మిశ్రా కమిషన్ తో బీసీలకు మేలు : మంత్రి సవిత**



**అమరావతి,కలంకౌంటర్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. దీనిలో భాగంగానే మాజీ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏక సభ్య డెడికేటెడ్ కమిషన్ నియమించినట్లు తెలిపారు. గత ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 24 శాతానికే పరిమితం చేసిందన్నారు. దీనివల్ల బీసీలు ఎన్నో పదవులు కోల్పోయారన్నారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ఎన్నికల్లో బీసీలకు ఇచ్చిన హామీని నెరవేర్చడానికి తమ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. దీనిలో భాగంగా దీనిలో భాగంగానే మాజీ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏక సభ్య డెడికేటెడ్ కమిషన్ నియమించిందన్నారు. ఈ కమిషన్ ఇచ్చే నివేదిక ఆధారంగా బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయనున్నామన్నారు. నా బీసీలు అంటూ వెనుకబడిన కులాలకు వైసీపీ ప్రభుత్వం తీవ్ర ద్రోహం చేసిందన్నారు. స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 24 శాతానికి కోత విధించి, సమాజంలో సగభాగమైన వెనుకబడి వర్గాల వారిని రాజ్యాధికారానికి దూరం చేశారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు ఆది నుంచి బీసీల పక్షపాతి అని తెలిపారు. బీసీలకు జరిగిన ద్రోహాన్ని గుర్తించి, అధికారంలోకి రాగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన వర్గాలకు 34 శాతం రిజర్వేషన్లు అందజేస్తామని అప్పట్లో హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల కోసం రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏక సభ్య డెడికేటెడ్ కమిషన్ ను నియమించారన్నారు.

**రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ తో బీసీలకు మేలు..** ఏపీలో ఎస్సీ వర్గీకరణంపై నియమించిన ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రా విజయవంతమైన పాత్ర పోషించిందని మంత్రి సవిత తెలిపారు. రాజీవ్ రంజాన్ మిశ్రా సమర్థత గుర్తించిన సీఎం చంద్రబాబునాయుడు... ఆయన నేతృత్వంలో డెడికేటెట్ కమిషన్ ఏర్పాటు చేశారన్నారు. ఈ కమిషన్ బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన వర్గాలకు మేలు చేసేలా నిర్ణయం తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తంచేశారు. రాజీవ్ రంజన్ మిశ్రా ఏక సభ్య డెడికేటెడ్ కమిషన్ నియమించినందుకు సీఎం చంద్రబాబుకు మంత్రి సవిత ధన్యవాదాలు తెలియజేశారు. డెడికేటెట్ కమిషన్ నియామకంపై బీసీ సంఘాలు సైతం హర్షం వ్యక్తంచేశాయి. సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కు, మంత్రులు లోకేశ్, సవితకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# కందుకూరు ప్రభుత్వ ఏరియా వైద్యశాలను 300 పడకలకు పెంచాలి

**● సీఎం చంద్రబాబు కు వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే ఇంటూరి ● సానుకూలంగా స్పందించిన సీఎం చంద్రబాబు ● సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపిన ఎమ్మెల్యే ఇంటూరి**



**అమరావతి, కలంకౌంటర్ :** అమరావతిలో సచివాలయం నందు గురువారంముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు కలసి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి పై వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ ఏరియా వైద్యశాల స్థాయిని పెంచాలని, పడకల సంఖ్యను 100 నుంచి 300కు పెంచాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు.గతంలో 2003లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ఈ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా మార్చిన విషయాన్ని వారికి గుర్తుచేశాను. ప్రస్తుతం మూడు నియోజకవర్గాల ప్రజలు ఈ ఆసుపత్రిపై ఆధారపడి ఉన్నారని, పెరిగిన జనాభా, కందుకూరు ప్రాంత పారిశ్రామిక అభివృద్ధి దృష్ట్యా ప్రస్తుత సౌకర్యాలు సరిపోవడం లేదని సీఎం దృష్టికి తీసుకువెళ్లాను.తాను చేసిన విజ్ఞప్తిపై ముఖ్యమంత్రి అత్యంత సానుకూలంగా స్పందించని ఎమ్మెల్యే తెలిపారు. కందుకూరు ఏరియా వైద్యశాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని, త్వరలోనే ఆసుపత్రి స్థాయిని పెంచి, 300 పడకల ఆసుపత్రిగా మార్చేందుకు అవసరమైన సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి తెలపడం ఎంతో సంతోషంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ధన్యవాదాలు.

# అవంతిక వైద్యానికి 28000/- ఆర్థిక సహాయం అందించిన శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ



**కందుకూరు,కలంకౌంటర్ :** గుడ్లూరు చెందిన అవంతికఅభ్యుదయ పాఠశాలలో లో 7 వ తరగతి చదువుతున్నది. వీరి తల్లి తండ్రులు దినసరి కూలి చేసుకొనేవారు.14/02/26 వ తేదీ ఎంతో ఉత్సాహంగా వారి పాఠశాల లో జరుగుతున్న వార్షికోత్సవానికి వస్తూ దురదృష్టవశాత్తు మోటార్ సైకిల్ ప్రమాదం జరిగింది.ఆ పాపకు తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో వెంటిలేటర్ పై కృత్రిమ శ్వాస తీసుకొంటూ ఒంగోలు ఓ ప్రైవేటు ఆసుపత్రి నందు చికిత్స తీసుకుంటుంది.ఆ పాప తల్లి కూడా గాయలతో ఒంగోల్ రిమ్స్ హాస్పిటల్ లో మతి స్థిమితం కోల్పోయి ఉంది. ఈ పాప తండ్రికి వైద్యఖర్చుకు కూడా ఆర్థిక స్తోమత లేకపోవడంతో.ఆ పాప ఆసుపత్రి ఖర్చులకు ఆర్థిక సహాయం కావాలని గుడ్లూరు కి చెందిన ఎయిర్టెల్ చిన్న ద్వారా మన సొసైటీ దృష్టికి తీసుకువచ్చారు మన సొసైటీ సభ్యులు, మిత్రులు మంచిమనసు తో మానవతా దృక్పధంతో 28000/–ఆర్థిక సహాయం అందించారు. గురువారం ఆ పాప తండ్రి, వారి కుటుంబ సభ్యుల సమక్షంలో శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ద్వారా 28000/– చెక్కును వారికి అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా ఆల్ ఇండియా వాసవి సత్ర సముదాయాల మీడియా చైర్మన్ డాక్టర్ చక్కా వెంకట కేశవరావు మాట్లాడుతూ ఇంతక ముందు కూడా ఎంతో మంది పేదల వైద్యానికి సహాయం అందించిన సొసైటీ సభ్యులకు ఈ సందర్భంగా ధన్యవాదములు తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ కందుకూరు సేవా హృదయ డాక్టర్ రవ్వా శ్రీనివాసులు, సెక్రటరీ పబ్బిశెట్టి వెంకట సురేష్ (జే ఎం )షేర్స్ ఆఫీస్),ఈ.సి.మెంబర్ ఇన్నమూరి శ్రీనివాసులు, ఎయిర్టెల్ చిన్న, ఇన్నమూరి సుధాకర్ రావు, అజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఇంజనీరింగ్ రంగ పరిశ్రమల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది - రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**● ఇంజనీరింగ్ రంగ పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లపై ఏపీ ఛాంబర్ సభ్యులతో సమావేశమైన మంత్రి**



**అమరావతి,కలంకౌంటర్ :** ఇంజనీరింగ్ రంగ పరిశ్రమల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, పారిశ్రామిక వర్గాలకు ఎదురవుతున్న సమస్యలు, ఎదుర్కొంటున్న సవాళ్ళను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, (MSME), సెర్ప్ (SERP), ఎన్ఆర్ఐ (NRI) సాధికారత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేసారు. ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ సభ్యులతో వెలగపూడి సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమావేశం అయ్యారు. ఇంజనీరింగ్ రంగ పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లు మరియు ఉత్పత్తి ప్రమాణీకరణ(Product Standardisation) దిశగా తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమీక్షా సమావేశంలో చర్చించారు. గుర్తించిన పారిశ్రామిక వాడల్లో సరైన పన్ను విధింపు కోసం ప్రత్యేక యంత్రాంగాన్ని రూపొందించడం, ముడిసరుకు సరఫరా కోసం ఎన్ఎస్ఐసి సేవలను వినియోగించుకోవడం, సీజీటీఎంసిఈ పథకం కింద మరిన్ని ఎంఎస్ఎంఈ రుణాలకు గ్యారెంటీ కల్పించడం, చిన్న పరిశ్రమలకు నగదు లభ్యత కోసం టీఆర్ఈడీఎస్ (Trade Receivables Discounting System) అమలును వేగవంతం చేయడం. ఏపీసిపీడీసిఎల్ అమలు చేస్తున్న విద్యుత్ టారిఫ్ సమస్యలను పరిష్కరించడం, ఇంజనీరింగ్ రంగంలో నైపుణ్యం కలిగిన మానవ వనరుల పెంపు, ఉత్పత్తుల సేకరణ ధరలపై ఈ సందర్భంగా చర్చించడం జరిగింది. దీనిపై స్పందించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఈ సందర్భంగా సభ్యులకు పలు సూచనలు చేశారు. సభ్యుల విన్నపాలపై సానుకూలంగా స్పందించిన మంత్రి, ఇతర రాష్ట్రాల్లో ఎంఎస్ఎంఈ విద్యుత్ టారిఫ్, ప్రాపర్టీ టాక్స్ విధింపులో ఉన్న అత్యుత్తమ విధానాలను అధ్యయనం చేసి తగు పరిష్కారాన్ని కనుగొంటాము అని మంత్రి స్పష్టం చేసారు. ముఖ్యంగా కేంద్ర బడ్జెట్లో ప్రతిపాదించిన విధంగా ఎంఎస్ఎంఈ'లకు ఎదురయ్యే సమస్యలను స్టేక్ హోల్డర్ల భాగస్వామ్యంతో పరిష్కరించడానికి, వారికి అండగా ఉండటానికి "కార్పొరేట్ మిత్ర" ఏర్పాటుపై తగిన ప్రతిపాదనలతో రావాలని మంత్రి ఛాంబర్స్ సభ్యులకు సూచించారు. ఈ సమావేశంలో ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు పొట్లూరి భాస్కర్ రావు, బి. రాజశేఖర్, బయన వెంకటరావు, ఆర్.వి. సుబ్బా రావు, గద్దె విజయ్ కుమార్, వెలగపూడి సాంబశివరావు, గుర్జీత్ సింగ్ సాహ్ని, కె.వి. సుబ్రహ్మణ్యం, మోహన్ పాటి సెంతుర్, జి. వకాల రావు, గుడివాడ జయ కుమార్, కోనేరు విశ్వప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అవగాహన, అప్రమత్తతతోనే సైబర్ మోసాల నుండి రక్షణ పొందవచ్చు - జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్



**విజయనగరం,కలంకౌంటర్ :** సైబరు మోసాలు పట్ల అవగాహన లోపం కారణంగా ప్రజలు మోసాలకు గురవుతున్నారని, ఇటువంటి సైబరు మోసగాళ్ళు, వారు చెప్పే మాయమాటలు పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ – సైబరు నేరాలకు పాల్పడే మోసగాళ్ళు ప్రజల వ్యక్తిగత సమాచారం, బ్యాంకింగు వివరాలు, ఓ.టి.పి.లు, సివివి, పాస్వర్డులు లాంటి అంశాలను దుర్వినియోగం చేసే అవకాశం ఉన్నందున, వాటిని ఎట్టి పరిస్థితుల్లోని ఇతరులతో పంచుకోవద్దని, గోప్యత పాటించాలన్నారు. ఈ మధ్యకాలంలో ట్రాఫిక్ చలానాల పేరుతో లింకులు మరియు ఎపికే ఫైల్స్ పంపి అమాయకపు ప్రజలనుండి సైబర్ నేరగాళ్ళు దోచుకుంటున్నారన్నారు. ప్రజల ఆసక్తిని గమనించి, సైబరు నేరగాళ్ళు వారి మొబైలు ఫోన్లకు కొన్ని లింకులు, ఎపికే ఫైల్స్, క్యూఆర్ కోడ్స్, సందేశాలను, ఈ–మెయిల్సు పంపి, వారి బ్యాంకు ఖాతాల్లోని సొమ్మును కాజేస్తున్నారన్నారు. అదే విధంగా ఆన్లైన్ లోన్ యాప్ ల వైపు వెళ్ళవద్దని ప్రజలను కోరారు. డిజిటల్ యుగంలో ప్రజల వ్యక్తిగత సమాచారం, ఆన్లైన్ బ్యాంకింగ్, సోషల్ మీడియా అకౌంట్లు, ప్రభుత్వ నెట్వర్క్లు వంటి వాటిపై హ్యాకింగ్, ఫిషింగ్, మాల్వేర్, ర్యాన్సమ్వేర్ వంటివి సైబరు నేరగాళ్ళు పంపి సైబరు దాడులకు పాల్పడుతున్నారన్నారు. ఈ దాడులను నియంత్రించేందుకు ప్రజలు సైబరు మోసాలు పట్ల అవగాహన పెంచుకోవాలని, హ్యాకింగుకు గురి కాని విధంగా బలమైన పాస్ వర్డు, టూ వే అథన్టికేషను ఏర్పాటు చేసుకోవాలని, నిబంధనలు ఎప్పటికప్పుడు గమనించాలని, అనుమానస్పద లింకులపై క్లిక్ చేయకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. అంతేకాకుండా అధికారిక వెబ్సైట్లును లేదా అప్లికేషన్లు మాత్రమే వినియోగించాలన్నారు. యుఆర్ఎల్ ని ధృవీకరించని నకిలీ వెబ్సైట్ లను వినియోగించవద్దన్నారు. నెట్ సెంటర్లలో వినియోగించే కంప్యూటర్లలో మీ లావాదేవీలు పూర్తయిన వెంటనే మీ సోషల్ మీడియా అకౌంట్స్, ఈ–మెయిల్స్ నుండి లాగ్ అవుట్ అవ్వాలని, సైబరు మోసగాళ్ళు పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలను జిల్లా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ కోరారు. అమాయక ప్రజలను ముఖ్యంగా మహిళలు, వృద్ధులను లక్ష్యంగా చేసుకొని కొంతమంది సైబరు నేరగాళ్ళు వాట్సాప్ కాల్స్ చేసి తమను డిజిటల్ అరెస్టు చేస్తున్నామని, ఇంటి నుండి బయటకు వెళ్ళ వద్దని, మాదక ద్రవ్యాల కేసులో ఇరుక్కున్నారని, ఆధార్ కార్డును దుర్వినియోగం చేసారని, మీ పిల్లల పై డ్రగ్స్ కేసు నమో దయ్యిందని, సిబిఐ లేదా ఎన్ఫోర్స్మెంట్ లేదా సిఐడి లేదా కోర్టు నుండి అధికారులుగా పరిచయం చేసుకొని, బెదిరింపులకు పాల్పడుతుంటారని, చివరకు సహాయం చేస్తున్నట్లుగా నమ్మబలికి డబ్బులను కొల్లగొడుతు న్నారన్నారు. ఇటువంటి నేరగాళ్ళు చెప్పే మాయమాటలు నమ్మవద్దని, ఎవరైనా ఈ తరహాలో ఫోనులు చేస్తే సమాచారాన్ని డయల్ 100/112 అందించాలని లేదా 1930కు లేదా www.cybercrime.gov.in లో ఫిర్యాదు చేయాలని ప్రజలకు జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ పిలుపునిచ్చారు.

# ఇది బాబు భజన.. అన్నీ తప్పుడు లెక్కలే: ఏపీ బడ్జెట్పై జగన్ విమర్శలు

**● ఏపీ బడ్జెట్ అబద్ధాలు, తప్పుడు లెక్కలమయం అని జగన్ విమర్శ ● సూపర్ సిక్స్ హామీలను గాలికి వదిలేశారని ప్రభుత్వంపై ఆరోపణ ● రాష్ట్ర ఆదాయం బాబు అండ్ కో జేబుల్లోకి వెళుతోందని ఘాటు వ్యాఖ్యలు ● సొంత ఆదాయాల వృద్ధిలో ఏపీ 22వ స్థానంలో ఉందని వెల్లడి ● నారా లోకేశ్ పైనా తీవ్ర స్థాయిలో జగన్ ధ్వజం**




**అమరావతి,కలంకౌంటర్ :** వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఇది ప్రజల బడ్జెట్ కాదని, కేవలం చంద్రబాబు భజన, తప్పుడు లెక్కలతో నిండిన మోసపూరిత పత్రమని ఆయన అభివర్ణించారు. గురువారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ప్రభుత్వ తీరును ఎండగట్టారు. "మోసానికి షర్టు, ప్యాంటు వేస్తే అది చంద్రబాబే. అబద్ధానికి రెక్కలు కడితే అది కూడా చంద్రబాబే" అంటూ జగన్ ఘాటు వ్యాఖ్యలతో ప్రసంగాన్ని ప్రారంభించారు. చంద్రబాబు పాలన "పబ్లిసిటీ పీక్.. పర్ఫామెన్స్ వీక్" అన్న చందంగా ఉందని ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు ఊదరగొట్టిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలను మూడు బడ్జెట్లలోనూ గాలికి వదిలేసి అన్ని వర్గాల ప్రజలను వెన్నుపోటు పొడుస్తున్నారని ఆరోపించారు. ఆర్థిక లెక్కలన్నీ తప్పుల తడకలేనని జగన్ అంకెలతో సహా వివరించారు. 2024–25లో రూ.1.19 లక్షల కోట్ల ఆదాయం వస్తుందని చెప్పి, వాస్తవానికి రూ.94,937 కోట్లు మాత్రమే రాబట్టారని తెలిపారు. పది నెలల్లో రాష్ట్ర ఆదాయ వృద్ధి కేవలం 4.25 శాతమేనని పేర్కొన్నారు. కాగ్ రిపోర్ట్ ప్రకారం, దేశంలోని 23 రాష్ట్రాల్లో సొంత ఆదాయాల పురోగతిలో ఏపీ చివరి నుంచి రెండో స్థానంలో (22వ ర్యాంక్) ఉందని, ఇది ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో 2026–27 నాటికి ఆదాయం 45% పెరుగుతుందని చెప్పడం హాస్యాస్పదమన్నారు. ప్రభుత్వ అసమర్థత వల్లే రాష్ట్ర ఆదాయం 'బాబు అండ్ కో' జేబుల్లోకి వెళ్తోందని, "దోచుకో.. దాచుకో.. పంచుకో" అనే విధానం అమలవుతోందని జగన్ ఆరోపించారు. అప్పుల వివరాలను బడ్జెట్లో చూపించకపోవడం పారదర్శకత లేకపోవడానికి నిదర్శనమన్నారు. మహిళలకు రూ.1,500, నిరుద్యోగ భృతి వంటి హామీలకు నిధుల కేటాయింపు ఏదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ ను లక్ష్యంగా చేసుకుని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రజల డబ్బుతో కొలంబో, ఢిల్లీ అంటూ విమానాల్లో తిరుగుతూ క్రికెట్ మ్యాచ్ లు చూస్తూ, స్టేడియాల్లో జల్సాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. "రాత్రికి కొలంబోలో ఉంటాడు, మరుసటి రోజు ఉదయం విజయ వాడలో ఉంటాడు... సాయంత్రానికి ఢిల్లీ వెళతాడు... అంతా ప్రైవేటు విమానాలే. దేశంలో బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు ఇలా జల్సాలు చేయడం ఎక్కడైనా ఉందా? చంద్రబాబుకు ఒక విమానం, లోకేశ్ కు ఒక విమానం, పవన్ కల్యాణ్ కు ఓ విమానం... అందరూ గాల్లోనే ఉంటారు. క్రికెట్ మ్యాచ్ చూడాలంటే కొలంబోనే వెళ్లాలా... టీవీలో చూస్తే కనపడదా... నేను కూడా టీవీలోనే చూశాను" అంటూ జగన్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.

# కేఎల్ యూనివర్సిటీ డ్రైవర్లకు ట్రాఫిక్ అవగాహన సదస్సు







**విజయవాడ, కలంకౌంటర్ :** విజయవాడ వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ ఆడిటోరియం లో డ్రైవర్లకు సిఐ కిషోర్ బాబు ఆధ్వర్యంలో ట్రాఫిక్ అవగాహన సదస్సు నిర్వహించారు. కేఎల్ యూనివర్సిటీ డ్రైవర్లు 120 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ కిషోర్ బాబు మాట్లాడుతూ డ్రైవర్ వృత్తి అనేది ఒక బాధ్యత గల జాబ్, ఉన్న జాబులో కల్లా డ్రైవర్ వృత్తి చాలా గొప్పది. మీద 60 మంది కాలేజీ పిల్లలు భవిష్యత్తు మీ చేతిలో ఉంటుంది. ప్రమాదం వచ్చినప్పుడు మీరు జాగ్రత్త వహించడం డ్రైవర్ల బాధ్యత.. ట్రాఫిక్ లో గాని మీరు ఎక్కువ వేగంగా వెళ్లడం అనేది చేయకూడదు. పైలట్ నడిపే వ్యక్తి కూడా ఒక వన్ అవర్ రెస్ట్ ఉంటుంది. అలాంటిది మీ డ్రైవర్లు వృత్తి అనేది రెస్ట్ అనేది ఉండదు.. మీరు చేసే వృత్తి పట్ల జాగ్రత్తగా ఉండాలి. మంచి యూనిఫాము నీటుగా ధరించాలి. అప్పుడే సమాజంలో గౌరవం అనేది వస్తుంది.. ఈ కార్యక్రమంలో ట్రాన్స్పోర్ట్ మేనేజర్ రాంప్రసాద్, అసిస్టెంట్ ట్రాన్స్పోర్ట్ మేనేజర్ ఎస్ సాయి, గ్యారేజ్ ఇంచార్జ్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

# నిబంధనల మేరకు జర్నలిస్టులకు అక్రెడిటేషన్

**● జీవోఎంఎస్ నెం.84 ప్రకారం జిల్లాలో తొలి విడత 742 కార్డుల జారీ ● జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**




**విజయవాడ, కలంకౌంటర్ :** ప్రభుత్వ నిబంధనలను అనుసరించి జిల్లాలో అర్హత ప్రమాణాలున్న జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామని, తొలి విడత 742 కార్డులను జారీచేసి, పంపిణీ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ (డీఎంఏసీ) ఛైర్మన్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్లో కలెక్టర్ లక్ష్మీశ గురువారం ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు మంజూరైన అక్రెడిటేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జర్నలిస్టుల అక్రెడిటేషన్ కార్డుల కాలపరిమితి పూర్తయినందున నూతన అక్రెడిటేషన్ కార్డుల మంజూరుకు జీవోఎంఎస్ నెం.84లోని నిబంధనలు, మార్గదర్శకాల మేరకు జిల్లాస్థాయి కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అక్రెడిటేషన్ కార్డుల కోసం జర్నలిస్టులు చేసుకున్న దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించిన అనంతరం తొలి విడతగా 742 అక్రెడిటేషన్ కార్డులు జారీకి డీఎంఏసీ ఆమోదం తెలిపిందన్నారు. అక్రెడిటేషన్ మంజూరైన జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నామని 2027, డిసెంబర్ వరకు అమల్లో ఉంటాయన్నారు. ప్రతి దరఖాస్తును నిష్పాక్షికంగా పారదర్శకంగా పరిశీలించి, అర్హత ఉన్న వారికి కార్డులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. మిగిలిన దరఖాస్తులను కూడా పరిశీలించి త్వరలోనే తదుపరి విడతలో కార్డులు జారీచేస్తామని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిలా ఉంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలను చేరవేయడంలో మీడియా పాత్ర కీలకమైందన్నారు. జిల్లా అభివృద్ధిలో ప్రభుత్వ యంత్రాంగానికి సూచనలు సలహాలు అందిస్తూ ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవడంలో పారదర్శకమైన సేవలు అందించడంలో సహకరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ కోరారు. అక్రెడిటేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో డీఐపీఆర్వో కేవీ రమణరావు, డివిజనల్ పీఆర్వో కె.రవి, ఆడియో విజువల్ పర్యవేక్షకులు వి.వి.ప్రసాద్, డీమ్యాక్ సభ్యులు, ఉప కార్మిక కమిషనర్ జి.ధనలక్ష్మి, పి.నాగమల్లేశ్వరరావు, కలిమిశ్రీ, యామినేని వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

# కర్నూలు క్లస్టర్ వర్సిటీని పూర్తి చేస్తాం: గౌరు చరితారెడ్డి ప్రశ్నకు లోకేశ సమాధానం

**విజయవాడ, కలంకౌంటర్ :** కర్నూలు క్లస్టర్ యూనివర్సిటీకి సంబంధించి రూ.139 కోట్లు మంజూరు కాగా, అందులో 'రూసా' పథకం కింద రూ.55 కోట్లు ఇప్పటికే ఖర్చు చేశామని ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. బ్యాలెన్స్ పనులు వచ్చే విద్యా సంవత్సరంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. శాసనసభలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేశ్ సమాధానమిస్తూ, క్లస్టర్ యూనివర్సిటీలో పెండింగ్ పనులు పూర్తి చేయడానికి రూ.74.5 కోట్లు అవసరమని తెలిపారు.ఏ కార్యక్రమం చేసినా క్లస్టర్ బేస్ అప్రోచ్ తో అభివృద్ధి చేయాలన్నది ప్రభుత్వ ఆలోచన అని తెలిపారు. ఇందుకోసం వర్టికల్ – హారిజంటల్ ఇంటిగ్రేషన్ చేపట్టాల్సి ఉందని అన్నారు. అవసరమైన ఎకో సిస్టమ్ ను అక్కడ క్రియేట్ చేయాల్సి ఉందని వెల్లడించారు. కర్నూలు పార్లమెంటు పరిధిలో కూటమి ప్రభుత్వం వచ్చాక పెద్దఎత్తున పారిశ్రామిక పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు.

# ఆహ్వానం





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం వాసవి భవన్ లో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ కొణిజేటి రోశయ్య విగ్రహావిష్కరణ మహోత్సవం కార్యక్రమానికి ప్రముఖ వ్యాపారవేత్త, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర నాయకుడు మామిడి ప్రసాద్ ,ప్రముఖ సిద్ధాంతి అనిల్ కుమార్,నగర ప్రముఖులకు ఆహ్వాన పత్రికలు అందజేసిన కృష్ణా జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సన్నిధి సాయి శ్రీనివాస్.

# యువతకు పెద్దఎత్తున ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం

- అందుకు అనుగుణంగా అధికారులు రూట్ మ్యాప్ రెడీ చేయాలి
- జాబ్ క్యాలెండర్ తోపాటే వర్సిటీల్లో అధ్యాపక పోస్టుల భర్తీకి కసరత్తు
- కోచింగ్ సెంటర్ల నిర్వహణ గురించి సుప్రీం కోర్టు ఇచ్చిన మార్గదర్శకాల అమలు పై మంత్రి లోకేష్ సమీక్ష



**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్రంలో పెద్దఎత్తున పారిశ్రామిక పెట్టుబడులు వస్తున్న తరుణంలో ఉపాధి కల్పనపైనే యంత్రాంగం దృష్టిపెట్టాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఉండవల్లి నివాసంలో ఎపీఎస్ఎస్ డీసీ అధికారులతో మంత్రి లోకేష్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... రాష్ట్రంలో గ్రౌండ్ అయిన పరిశ్రమల్లో ఈ ఏడాది 2లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యం, అందుకు అనుగు ణంగా అధికారులు రూట్ మ్యాప్ రూపొందించాలని సూచించారు. ఇప్పటికే గ్రౌండ్ అయిన పరిశ్రమల్లో పెద్దఎత్తున యువతకు ఉద్యోగాలు కల్పించడంపై దృష్టిసారించండి. రిలయన్స్ సీబీజీ, జుపిటర్, లారెన్స్ ఫార్మా, హెట్రో డ్రగ్స్ తోపాటు రాష్ట్రంలో కొత్తగా వస్తున్న రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టులకు అవసరమైన నైపుణ్యాలను గుర్తించి యువతకు స్కిల్లింగ్, రీస్కిల్లింగ్ చేపట్టండి. ఇందుకు అవసరమైన కరిక్యులమ్ రూపకల్పనలో ఆయారంగాల్లో పేరుగాంచిన పరిశ్రమల సలహాలను తీసుకోండి. ఇప్పటికే కొన్ని ప్రధాన సంస్థలు నేరుగా స్కిల్ డెవలప్ మెంట్ శిక్షణా కేంద్రాలను నెలకొల్పాయి, వాటిని అధ్యయనం చేసి, అదేతరహాలో ఐటీఐలకు అనుబంధంగా ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేసేలా చూడాలని సూచించారు. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో మూడునెలలకోసారి నిర్వహిస్తున్న జాబ్ మేళాల ద్వారా యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు లభిస్తున్నాయి, కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ (KPI) లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని అన్నారు.

**త్వరలో ఏఐ ఆధారిత నైపుణ్యం పోర్టల్ ప్రారంభం..** నైపుణ్యం పోర్టల్ పై మంత్రి లోకేష్ సమీక్షిస్తూ... సాధ్యమైనంత త్వరలో పోర్టల్ ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనిపై అధికారులు స్పందిస్తూ... ఇందుకు సంబంధించి ఇప్పటికే మాడ్యూల్స్ సిద్ధమయ్యాయి, 25 రంగాలకు సంబంధించి డేటా ఇంటిగ్రేషన్ పూర్తయింది, వాటిలో 1,14,899 ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయి. ఇందులో 3,100 విదేశీ ఉద్యోగాలు కూడా ఉన్నాయి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన 16మంది రిక్రూటర్స్ కూడా రెడీగా ఉన్నారు. ఇందులో ట్రయల్ బేసిస్ లో ఇప్పటికే 20వేలమందికి పైగా విద్యార్థులు, 60వేలమంది జాబ్ సీకర్స్ కు విజయవంతంగా కీలకమైన ఏఐ ఆధారిత ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

**అధ్యాపక పోస్టుల భర్తీపై సమీక్ష..** రాష్ట్రంలోని యూనివర్సిటీలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అధ్యాపక పోస్టుల భర్తీకి చేపట్టాల్సిన చర్యలపై మంత్రి లోకేష్ అధికారులతో సమీక్షించారు. ఎలాంటి న్యాయపరమైన చిక్కులు లేకుండా గత ఏడాది నిర్వహించిన డీఎస్సీ తరహాలో ఉగాదికి విడుదల చేయబోయే జాబ్ క్యాలండర్ లో అధ్యాపక పోస్టుల నోటిఫికేషన్ కూడా ఇచ్చి, భర్తీకి చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చిన విదేశీ యూనివర్సిటీలకు (ఫారిన్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్స్ (FHEIs) కు ప్రోత్సాహకాలు, విధివిధానాలపై చర్చిం చారు. విద్యార్థుల ఆత్మహత్య, మానసిక ఒత్తిడి నివారణకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా కోచింగ్ సెంటర్ రెగ్యులేషన్స్ రూపకల్పనపై పబ్లిక్ డొమైన్ ద్వారా ప్రజాభిప్రాయాన్ని తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, ఉన్నత విద్య కమిషనర్ నారాయణ భరత్ గుప్తా, స్కిల్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ సీఈవో గణేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో భూప్రకంపనలు.. వినుకొండకు సమీపంలో భూకంప కేంద్రం!

- పల్నాడు జిల్లాలో తెల్లవారుజామున భూకంపం
- రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 3.5గా నమోదు



**విజయవాడ, కలంకౌంటర్ :** ఏపీలో మరోసారి భూకంపం సంభవించింది. పల్నాడు జిల్లాలో ఈ తెల్లవారుజామున భూప్రకంపనలు సంభవించాయి. రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 3.5గా నమోదయింది. వినుకొండకు 20 కిలోమీటర్ల దూరంలో, భూ ఉపరితలానికి 10 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం ఉందని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ తెలిపింది. భూప్రకంపనల కారణంగా దర్శి, వినుకొండ చుట్టుపక్కల ప్రాంతాల్లో భూమి స్వల్పంగా కంపించింది. ఇళ్లలోని వస్తువులు కదలడంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. అయితే, ఈ ప్రకంపనల వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదు. దీనిపై నిపుణులు స్పందిస్తూ... రాబోయే రోజుల్లో కూడా మరిన్ని భూకంపాలు రావచ్చని తెలిపారు. మరోవైపు, తెలుగు రాష్ట్రాల్లో తరచుగా భూమి కంపిస్తుండటంపై ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కొన్ని నెలల క్రితం తెలంగాణలో కూడా పలు ప్రాంతాల్లో భూమి కంపించిన సంగతి తెలిసిందే.









Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com